# క్రీడా స్ఫూర్తితో ఉన్నత శిఖరాలు



టాస్ వేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

- మాజీ మంత్రి జోగు రామన్న
- ఏసీఎల్ ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్ ప్రారంభం

ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 16 : ప్రతి క్రీడాకారుడికి క్రీడాస్ఫూర్తి ముఖ్యమని, దీంతోనే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. ఆదిలాబాద్‌లో కొన్ని సంవత్సరాలుగా నిర్వహిస్తు వస్తున్న ఆదిలాబాద్ క్రికెట్ లీగ్ మ్యాచ్ టోర్నమెంట్ ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం ప్రారంభమయ్యాయి. డైట్ మైదానంలో 45 రోజుల పాటు సాగే ఈ క్రికెట్ టోర్నమెంట్‌ను మాజీ మంత్రి జోగు రామన్న శనివారం ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకొని టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. అనంతరం బ్యాటింగ్ చేసి క్రీడాకారుల్లో ఉత్సాహన్ని నింపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్‌లో నిర్వహించే ఏసీఎల్ ప్రీమియర్ లీగ్ ఎంతో ప్రాచుర్యం పొందిందని ఇతర రాష్ట్రాల నుంచి క్రీడాకారులు సైతం ఉత్సాహన్ని చూపిస్తూ ఇందులో పాల్గొనడం అభినందనీయమన్నారు. ప్రతి ఏటా క్రీడాకారులకు తమవంతు పూర్తి సహకారం ఉంటుందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం క్రీడలకు ఎంతో ప్రాధాన్యం కల్పించిందని, మైదానాలు, శారీరక దృఢత్వాన్ని పెంపొందించేలా ఓపెన్ జిమ్‌ను సైతం ఏర్పాటు చేసిందన్నారు. జోగు ఫౌండేషన్ తరపున ప్రతి ఏటా గ్రామీణ క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని వెలికితీసేలా వారికి క్రీడా సామగ్రిని సైతం అందించామన్నారు. క్రీడాకారులు తమ క్రీడలను మెరుగుపరుచుకొని జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో తమ స్థానాన్ని సుస్థిరం చేసుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు అజయ్, కౌన్సిలర్ వెంకన్న, అశోక్ స్వామి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, నాయకులు కుమ్ర రాజు, సాజిదొద్దీన్, బుట్టి శివ కుమార్, అతిక్, ఆశన్న పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 16 : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎంపీ సోయం బాపురావ్ సూచించారు. శనివారం ఆదిలాబాద్‌లోని ఇందిరా ప్రియదర్శిని మైదానంలో ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అథ్లెటిక్స్ క్రీడా పోటీలను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, అథ్లెటిక్స్ సెక్రటరీ రాజేశ్, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ కాంతారావ్ పాల్గొన్నారు.

# నిపాని పల్లె దవాఖాన పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న ఎన్‌క్వాస్ బృందం అధికారులు

భీంపూర్, డిసెంబర్ 16 : ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం నిపాని గ్రామంలోని పల్లె దవాఖాన (వెల్‌నెస్ సెంటర్)ను శనివారం జాతీయ నాణ్యత ప్రమాణాల పరిశీలన (ఎన్‌క్వాస్) బృందం పరిశీలించింది. ఢిల్లీ నుంచి వచ్చిన డాక్టర్ ప్రదీప్ కుమార్ చౌదరి, డాక్టర్ సుబ్రజ్యోతిరావు నాణ్యత పరిశీలనలో భాగంగా రికార్డులు పరిశీలించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అమలవుతున్న వైద్య పథకాలు ఇక్కడ ఎలా ఉన్నాయని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు అందించే వైద్య ఆరోగ్య పథకాలు, సాధారణ వైద్యం ఏ విధంగా నిర్మాణాత్మకంగా అమలు చేస్తున్నది గమనించారు. ఈ వివరాల ఆధారంగా మార్కుల కేటాయింపు ఉంటుందని వాటిని బట్టి నాణ్యత ప్రమాణాల సర్టిఫికెట్‌కు ఎంపికయ్యేది లేనిది వెల్లడిస్తారని ఎన్‌క్వాస్ బృందం అధికారు లు తెలిపారు. వారి వెంట వైద్యసిబ్బంది ఉన్నారు.

## ఆర్జీయూకేటీ అధ్యాపకుడికి డాక్టరేట్



అధ్యాపకుడిని అభినందిస్తున్న డైరెక్టర్

బాసర, డిసెంబరు 16 : ఆర్జీయూకేటీ బాసరలో బయోసైన్స్ శాఖలో అధ్యాపకుడిగా పని చేస్తున్న డాక్టర్ శీలం రామారావుకు డాక్టరేట్ అవార్డు వచ్చినట్లుగా డైరెక్టర్ సతీశ్ కుమార్ తెలిపారు. ఇకలాజికల్ ఇంప్లికేషన్స్ అండ్ కన్జర్వేషన్ స్ట్రాటజీస్ ఆఫ్ కొండగట్టు హిల్ ఫారెస్టు, తెలంగాణ ఇండియా అనే అంశంపై ఆయన చేసిన పరిశోధనలకు గాను ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ అందించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శీలం రామారావును వీసీ వెంకటరమణ అభినందనలు తెలిపారు.

# ఆటో డ్రైవర్ల ఆందోళన




బోథ్: ఆందోళన చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు, ఆటో డ్రైవర్లు

బోథ్/తాంసి/ఇచ్చోడ/ఖానాపూర్, డిసెంబర్ 16: కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడం వల్ల మహిళలు ఆటోలు ఎక్కడం లేదని, దీంతో ఉపాధి కోల్పోయామని ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలోని ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా బోథ్‌లోని ఆర్టీసీ బస్సు ఎదుట ఏఐటీయూసీ అనుబంధ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ మండలాధ్యక్షుడు సగిర్ అహ్మద్ ఆధ్వర్యంలో, ఇచ్చోడలో సహారా జీప్ డ్రైవర్స్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, తలమడుగు మండలం ఖోడద్ గ్రామంలోని అంతర్జాతీయ రహదారిపై తాంసి, తలమడుగు, ఆదిలాబాద్ మండలాల ఆటో డ్రైవర్లు ఆందోళన చేపట్టారు. అలాగే నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లోఎన్టీఆర్ చౌరస్తా నుంచి తెలంగాణ చౌరస్తా వరకు ఖానాపూర్, కడెం, పెంబి ఆటో డ్రైవర్ల యూనియన్ సంఘ నాయకులు, డ్రైవర్లు ఆటో, టాటా మ్యాజిక్‌లతో కలిసి భారీ ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా ఆటోలు నడుపుకుంటూ ఇదే వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నామన్నారు. ఉచిత ప్రయాణం వల్ల మహిళలు ఆటోల్లో ఎక్కడం లేదన్నారు. దీనివల్ల తమకు గిరాకీ లేక నష్టపోతున్నామని, కుటుంబ పోషణకు కష్టమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపాలని, ప్రతి నెలా జీవన భృతి ₹10వేలు, ప్రతి ఆటో డ్రైవర్‌కు జీవిత బీమా ₹5లక్షల పాలసీ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సుమేర్ పాషా, ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు దళిత్ ఆనంద్, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.




ఖానాపూర్: ఆటోలతో ర్యాలీ తీస్తున్న ఆటోడ్రైవర్లు

# బాధితులకు సత్వర న్యాయం అందించాలి

- ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్
- జిల్లా స్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం



మాట్లాడుతున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్

ఎదులాపురం, డిసెంబర్ 16 : ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు సత్వర న్యాయం అందించాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశానికి ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డితో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. 2023 సంవత్సరంలో 47 కేసులను గాను 17 కేసులు పెండింగ్, ట్రయల్‌లో 25 కేసుల విచారణలో ఉన్నాయని, 5 కేసులు పూర్తయ్యాయని తెలిపారు. ఇప్పటి వరకు రూ.24,12,500 ఉపశమనం కింద బాధితులకు పరిహారం అందించడం జరిగిందన్నారు. కేసుల పరిష్కారానికి, బాధితులకు పరిహారం అందేలా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సూచించారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలు, బాధితులకు అందిస్తున్న న్యాయ సేవలు, పరిహారంపై నివేదికను అందజేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఇప్పటి వరకు నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, బాధితులకు నష్ట పరిహారం చెల్లింపులు తదితర అంశాలపై వివరంగా సమీక్షించారు.

## గంజాయి సాగు చేసే రైతులకు సంక్షేమ పథకాలు నిలిపివేస్తాం

గంజాయి సాగు చేసే రైతులకు రైతుబంధు, ఇతర ప్రభుత్వ పథకాలు నిలిపివేస్తామని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. జిల్లాలో మత్తు పదార్థాల నియంత్రణకై జిల్లా స్థాయి అధికారులతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డితో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మత్తు పదార్థాలు, గంజాయి సాగు ,రవాణా చేసే వారిపై కేసులు నమోదు చేస్తూ ప్రభుత్వ పథకాలైన రైతుబంధు లాంటివి రాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముఖ్యంగా యువత మత్తు పదార్థాల బారిన పడకుండా పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కల్పించాలని సూచించారు. మత్తు పదార్థాలకు బానిసైన యువత, ఇతరులకు డి అడిక్షన్ సెంటర్ ద్వారా నయం చేసే అవకాశం ఉన్నందున వాటిని వినియోగించుకోవాలన్నారు. అనంతరం ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గంజాయి స్మగ్లర్లపై పీడీయాక్ట్ నమోదు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసి గంజాయి విక్రయదారులను, పండించే వారిని నియంత్రిస్తున్నట్లు తెలిపారు. గత సంవత్సరం 27 కేసులలో 64 మంది వ్యక్తులపై గంజాయి కేసులు నమోదు చేసి వారి వద్ద నుంచి దాదాపు 291 కిలోల, రూ.67,64,793 విలువ చేసే గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా గంజాయి పండిస్తున్న 38 మంది వ్యక్తులను అరెస్టు చేయడం జరిగిందని వీరిపై 20 కేసులను నమోదు చేస్తూ 133 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకోగా 275గంజాయి మొక్కలను సైతం స్వాధీనం చేసుకొని ధ్వంసం చేసినట్లు తెలిపారు. అనంతరం గంజాయి రహిత సమాజాన్ని సాధించేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పోస్టర్‌ను కలెక్టర్, ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి, అదనపు కలెక్టర్ ఖుష్బుగుప్తా విడుదల చేశారు. కార్యక్రమంలో ఎస్సీ కమిషన్ సభ్యురాలు నీలాదేవి, ఆర్డీవోలు స్రవంతి, జీవాకర్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారులు సునీత, రాథోడ్ రమేశ్, శంకర్, డీఎస్పీ వీ ఉమేందర్, ఇతర శాఖ అధికారులు ఉన్నారు.



హాజరైన అధికారులు